క్లుప్తంగా

రోడ్డు విస్తరణ పనులు పరిశీలన

టెక్కలి రూరల్: కోటబొమ్మాళి మండలంలోని తిలారు పంచాయతీ గవరమ్మపేట గ్రామం నుంచి పేటపాడు మీదుగా ఎత్తురాళ్లపాడు ఎన్‌హెచ్-16 జాతీయ రహదారి వరకు జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులను రైల్వే సెక్షన్ ఇంజినీర్ శర్మ, సిగ్నల్ అధికారి రామారావులు గురువారం పరిశీలించారు. రైల్వేలైన్లకు అనుకుని ఉన్న రోడ్డు పనుల నాణ్యతను పరిశీలించి, ఎటువంటి రాజీ పడకుండా నాణ్యతగా రహదారుల నిర్మాణం చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు


కొర్లాంలోని దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

సోంపేట: మండలంలోని ప్రైవేటు లైసెన్స్ ఎరువుల దుకాణాల్లో అధిక ధరలకు ఎరువులు, రసాయన మందులు విక్రయిస్తే చర్యలు తప్పవని విజిలెన్స్, వ్యవసాయాధికారులు తెలిపారు. కొర్లాం, సోంపేట పరిధిలోని ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్, రెవెన్యూ, వ్యవసాయాధికారులు గురువారం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు. అధిక ధరలకు విక్రయించినా, నోటీసు బోర్డులో స్టాక్ వివరాలు తెలియజేయకపోయినా చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ సతీష్, తహసీల్దార్ బి.అప్పలస్వామి, వ్యవసాయాధికారి బి.నర్సింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ


నారాయణరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ నర్తు

కవిటి: మండలంలోని కరాపాడు మాజీ ఎంపీటీసీ సభ్యుడు నర్తు నారాయణరావు ఇటీవల అకాల మరణం చెందారు. దీంతో వారి కుటుంబాన్ని జి.కరాపాడులో ఎమ్మెల్సీ నర్తు రామారావు గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన కుమారులు నర్తు గంగరాజు, తేజేశ్వరరావులకు ధైర్యం చెప్పారు. పార్టీ అన్నివిధాలుగా అండగా ఉంటుందని తెలియజేశారు.

కంచిలి: మండలంలోని తలతంపర పంచాయతీకి చెందిన వైఎస్సార్‌సీపీ నేత భరత్‌దొళాయి తండ్రి కులుమోని దొళాయి(94) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. అలాగే కవిటి మండలం కరాపాడు పంచాయతీ పరిధి జి.కరాపాడు గ్రామ మాజీ ఎంపీటీసీ సభ్యుడు నర్తు నారాయణరావు(74) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో వీరి కుటుంబాలను ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి గురువారం పరామర్శించారు ఆయనతో పాటు మండల పార్టీ అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయరావు, పార్టీ నేతలు లడ్డుకేశవపాత్రో, తలగాన తిరుపతిరావు, కొణపల సురేష్, తలతంపర ఎంపీటీసీ సభ్యుడు బృందావన్ సాహు, మోహన్‌కుమార్ మజ్జి తదితరులు ఉన్నారు.

నిరీక్షణ.. ప్రదక్షిణ..!

- నూతన పింఛన్ల కోసం అర్హుల ఎదురుచూపులు
- 15 నెలలుగా ఓపెన్ అవ్వని సైట్
- సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు
- పట్టించుకోని ప్రభుత్వం


పలాసపురం గ్రామ సచివాలయం

సోంపేట: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు పూర్తవుతున్నా కొత్త పింఛన్ల కోసం ఎదురుచూపులు తప్పడం లేదు. వితంతు, వృద్ధాప్య పింఛన్ల కోసం నూతనంగా దరఖాస్తులు చేసుకోవడానికి అర్హులు నిత్యం సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. కానీ ఇంకా సైట్ ఓపెన్ అవ్వలేదని అధికారులు చెబుతుండడంతో నిరాశగా వెనుదిరుగుతున్నారు. గ్రామాల్లోని అర్హులైన వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ప్రభుత్వం అందజేసే పింఛన్లే ప్రధాన ఆధారం. గత ప్రభుత్వం ప్రతినెలా రూ.3 వేల పింఛన్ అందజేసేది. అయితే ప్రస్తుత ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పింఛన్ నగదును రూ.4 వేలకు పెంచింది. కానీ అదనంగా నూతన పింఛన్లు మంజూరు చేయకపోవడంతో అర్హులకు ఇబ్బందులు తప్పడం లేదు.

వైఎస్సార్‌సీపీ హయాంలో...

గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన మూడు నెలలకే లబ్ధిదారులను ఎంపిక చేసి కొత్తగా అర్హులైనవారికి పింఛన్లు అందజేసింది. మొదటి మూడు సంవత్సరాల పాటు ప్రతీ మూడు నెలలకు ఒకసారి చొప్పున నూతన పింఛన్లు అందజేసేది. ఆ తర్వాత 2023, 2024 సంవత్సరాల్లో ప్రతీ ఆరు నెలలకు అర్హులైన వారు నష్టపోకుండా వలంటీర్ల ద్వారా ఎంపిక చేసి పింఛన్లు అందజేసింది. 2024 జనవరిలో వైఎస్సార్‌సీపీ హయాంలో చివరిగా నూతన పింఛన్లు అందజేశారు. తర్వాత ఎన్నికల కోడ్ రావడంతో నూతన పింఛన్లకు బ్రేక్ పడింది. ఆవిధంగా 2024 ఏప్రిల్ నెలలో ఆగిపోయిన సైట్ నేటికీ కూడా ప్రారంభం కాలేదు. ప్రస్తుత ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు పూర్తయినా పింఛన్లు మంజూరు చేయకపోవడంతో అర్హుల్లో ఆందోళన నెలకొంది.

కూటమి ప్రభుత్వం వచ్చాక...

ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గతేడాది నవంబర్ నెలలో కొత్త జీవో తీసుకొచ్చింది. పింఛను అందుకుంటున్న భర్త చనిపోతే, మరుసటి నెల నుంచి భార్యకు పింఛను అందజేయాలని ఆదేశాలు జారీ చేసింది. నెలలో 15 నుంచి 31వ తేదీలో చనిపోతే నెల విడిచి మరో నెలలో పింఛన్ అందజేయాలని స్పష్టం చేశారు. అయితే ఫించన్ రాని వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందినా, ప్రమాదంలో మృతి చెందిన అలాంటివారి భార్యలకు పింఛన్ అందజేసేందుకు చర్యలు తీసుకోకపోవడంతో అవస్థలు పడుతున్నారు. మరోవైపు ఏడాదిగా నూతన పింఛన్లు రాకపోవడంతో సోంపేట మండలంలో 60 సంవత్సరాలు నిండిన సుమారు 1,500 మందికి పైగా లబ్ధిదారులు పింఛన్ల కోసం ఎదురుచూస్తున్నారు. 2024 డిసెంబర్‌లో దరఖాస్తులు స్వీకరించి సంక్రాంతికి జన్మభూమి కార్యక్రమం నిర్వహించి, నూతన పింఛన్లు అందజేస్తామని గత డిసెంబర్‌లో ప్రజాప్రతినిధులు ప్రకటనలు చేశారు. దీంతో సంక్రాంతికి నూతన పింఛన్లు అందుతాయని ఎదురు చూసిన వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ఎదురు చూపులే మిగిలాయి.

50 ఏళ్ల హామీ ఎన్నడో..?

ఎన్నికల సమయంలో అధికారంలోకి వస్తే వెనుకబడిన తరగతులకు చెందినవారికి 50 సంవత్సరాలు పూర్తయిన వెంటనే పింఛన్లు అందజేస్తామని కూటమి నాయకులు హామీ ఇచ్చారు. దీంతో మండలంలో సుమారు 6 వేల మందికి పైగా 50 సంవత్సరాలు నిండినవారు ప్రభుత్వ హామీ ఎప్పుడు అమలు చేస్తుందా అని ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం నూతన పింఛను దరఖాస్తులు స్వీకరించేటప్పుడు 50 సంవత్సరాలు నిండిన వారి దరఖాస్తులు కూడా తీసుకోవాలని కోరుతున్నారు.

దరఖాస్తులు స్వీకరించాలి



కూటమి ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు పూర్తయినా నేటికీ నూతన పింఛన్ల కోసం దరఖాస్తుల స్వీకరించకపోవడం దారుణం. అర్హులైన లబ్ధిదారులు సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. 50 ఏళ్లకు పింఛన్ అందజేస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీ గాలిలో కలిసిపోయింది.

– పాతిన శేషగిరి, సర్పంచ్, మామిడిపల్లి

50 ఏళ్లకు పింఛన్ అందజేయాలి



కూటమి ప్రభుత్వంలో చేతి వృత్తుల వారికి ఎటువంటి పథకాలు అందడం లేదు. ప్రభుత్వం ఎన్నికల హామీలో భాగంగా వెనుకబడిన తరగతులవారికి 50 ఏళ్లకు పింఛను అందజేస్తామని హామీ ఇచ్చింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం వెనుకబడిన తరగతులకు చెందిన 50 ఏళ్లు నిండినవారికి వెంటనే పింఛన్లు అందజేయాలి.

– సాహుకారి జాని, జింకిభద్ర, సోంపేట మండలం

అర్హులకు అందజేయాలి



అర్హులందరికీ ప్రభుత్వం నూతన పింఛన్లు అందజేయాలి. వృద్ధులు, వితంతువులకు ప్రభుత్వం అందజేసే పింఛనే ఆధారం. ఫించన్ల మంజూరు ప్రక్రియ నిరంతరం కొనసాగాలి. కనీసం ఆరు నెలలకు ఒక్కసారైనా నూతన పింఛన్లు అందజేయాలి. అర్హులైన లబ్ధిదారులను గుర్తించి తక్షణమే మంజూరు చేసేందుకు చర్యలు తీసుకోవాలి.

– డాక్టర్ నిమ్మన దాస్, ఎంపీపీ, సోంపేట మండలం

ఎదురు చూస్తున్నాను

నూతన పింఛన్ కోసం సంవత్సరంగా ఎదురు చూస్తున్నారు. నా భర్త చనిపోయి సంవత్సరం పూర్తయ్యింది. అయినా నాకు ఇంకా పింఛన్ అందలేదు. ప్రభుత్వం స్పందించి నాకు పింఛన్ అందజేసి ఇబ్బందులు తొలగించాలి.

– యజ్జల కృష్ణవేణి, బెంకిలి, సోంపేట మండలం

ఆదేశాలు వస్తే అందజేస్తాం



ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రస్తుతం పింఛను అందుకుంటున్న భర్త చనిపోయిన భార్యలకు నూతన పింఛన్లు అందజేస్తున్నారు. అర్హులైన వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తే పింఛన్లు అందజేయడం జరుగుతుంది.

– ఈశ్వరమ్మ, ఎంపీడీవో, సోంపేట

యూరియా కొరత ఎందుకొచ్చింది..?


యూరియా కొరతపై అధికారులను నిలదీస్తున్న సభ్యులు

- టీడీపీ కార్యకర్తలకే పంచిపెట్టేశారు
- నందిగాం సర్వసభ్య సమావేశంలో సభ్యుల నిలదీత

టెక్కలి: గత ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో ఎన్నడూ కనిపించని యూరియా కొరత, ఇప్పుడే ఎందుకొచ్చిందని పలువురు ప్రజాప్రతినిధులు నిలదీశారు. నందిగాం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ నడుపూరు శ్రీరామ్మూర్తి అధ్యక్షతన సర్వసభ్య సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా యూరియా కొరతపై సభ్యులంతా ధ్వజమెత్తారు. రైతులకు యూరియా అందజేయకుండా పూర్తిస్థాయిలో టీడీపీ నాయకులు, కార్యకర్తలకే అడ్డదారిలో మళ్లించేశారని మండిపడ్డారు. కొంతమంది ఎరువులు బ్లాక్ మార్కెట్లోకి తరలించి అమ్ముకున్నారని ఆరోపించారు. దీనివలన మండలానికి చెందిన రైతులు టెక్కలి, నరసన్నపేట, పలాస, ఒడిశా వెళ్లి అధిక ధరలకు కొనుగోలు చేయాల్సిన దుస్థితి నెలకొందని వాపోయారు. మండలంలో ఉయ్యాలపేట గ్రామానికి ఇప్పటివరకు ఒక్క బస్తా యూరియా కూడా పంపిణీ చేయలేదని సర్పంచ్‌తో పాటు సభ్యులు వ్యవసాయ శాఖ అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

రైతులకు ప్రభుత్వం అన్యాయం చేసింది

కూటమి ప్రభుత్వం రైతులకు తీవ్ర అన్యాయం చేసిందని, వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న టెక్కలి నియోజకవర్గంలోనే ఎరువుల పంపిణీ జరగకపోతే, రాష్ట్రంలో పరిస్థితి ఎలా ఉందో అర్థమవుతోందని సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ప్రభుత్వమే రైతులకు పంటల బీమా చెల్లించేదని, ఇప్పుడు రైతులు సొంతంగా బీమా ప్రీమియం చెల్లించుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. తక్షణమే రైతులకు యూరియా అందజేయాలని డిమాండ్ చేశారు. అలాగే వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా మారుమూల ప్రాంతాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని కోరారు. మండల పరిషత్ నిధులతో నూతన మండల పరిషత్ కార్యాలయ భవన నిర్మాణం చేపట్టాలని కోరుతూ సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. నందిగాం శ్మశానాన్ని ఆక్రమించుకుని వరిసాగు చేస్తున్నారని తక్షణమే ఈ ఆక్రమణలు తొలగించాలని సభ్యులు కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన తర్వాత మండలంలో ఒక్క ఇంటి బిల్లూ చెల్లించలేదని, నూతనంగా ఒక్క ఇల్లు కూడా మంజూరు చేయలేదని దుయ్యబట్టారు. అధికారులు స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులను పట్టించుకోకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని, గ్రామాల్లో ప్రోటోకాల్ పాటించడం లేదని ఆరోపించారు. అనంతరం సమావేశానికి హాజరవ్వని అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు. సమావేశంలో ఎంపీడీవో కుమార్ పట్నాయక్, వైస్ ఎంపీపీలు లక్ష్మీకాంతం, వసంత్ కుమార్, ఈవోపీఆర్డీ రాజారావు, ప్రత్యేక ఆహ్వానితులు చిన్ని జోగారావు యాదవ్, యర్ర చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

'ఉన్నోడిదే ఈ లోకం.. లేనోడికిది శాపం' పాట విడుదల


పాటను ఆవిష్కరిస్తున్న నాయకులు, కళాకారులు

వజ్రపుకొత్తూరు రూరల్: పుక్కళ్ల క్రియేషన్ బ్యానర్‌పై వడ్డి సందీప్ దర్శకత్వంలో నిర్మితమైన 'ఉన్నోడిదే ఈ లోకం.. లేనోడికిది శాపం' సందేశాత్మకమైన పాటను మండలంలోని బాతుపురంలో ఫిలిం చాంబర్ ఆఫ్ కామర్స్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కుమార్ నాయక్, జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్ చేతులమీదుగా గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో ఉన్న ఆర్థిక అసమానతలను చక్కని సాహిత్యంతో వివరించారని కొనియాడారు. యువత అధునాతన సాంకేతికతను అందిపుచ్చుకొని సినీ రంగంవైపు అడుగులు వేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సిక్కోలు జానపద సాహిత్య కళావేదిక అధ్యక్షుడు మామిడి కృష్ణారావు, మాజీ అధ్యక్షుడు రాపాక ధనరాజు, ప్రముఖ సోషల్ వర్కర్ హనుమంతు మురళీధర, రచయిత, డైరెక్టర్ పుక్కళ్ల రాజేంద్ర, కామరాజు, బైపల్లి సర్పంచ్ డొంక ఉషారాణి, మాజీ సర్పంచ్ మడ్డు నాగేశ్వరరావు, బత్తిని లక్ష్మీనారాయణ, దువ్వాడ ఉమామహేశ్వరరావు, జశ్వంత్, భారతి, కుమారి రమ్య, కామేష్ తదితరులు ఉన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులు వీరే...


కె.చంద్రశేఖరం


కె.సాయిరాం


బి.రత్నం


నారాయణమూర్తి

టెక్కలి రూరల్: నందిగాం మండలం లగిదాస్‌పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోషల్ టీచర్‌గా పనిచేస్తున్న బెందాళం రత్నం జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికయ్యారు. అదేవిధంగా పెద్ద తామరాపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న మార్పు నారాయణమూర్తికి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు వరించింది. దీంతో వీరిని పలువురు అభినందించారు.

కంచిలి: మండలంలోని ఇద్దరు ఉపాధ్యాయులు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైనట్లు ఎంఈవో ఎస్.శివరాంప్రసాద్ గురువారం సాయంత్రం తెలిపారు. స్కూల్ అసిస్టెంట్ కేటగిరీలో కంచిలి జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు అగ్గున త్రినాథరావు, ఎస్జీటీ కేటగిరీలో బొగాబెణి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు శరద చంద్ర బెహరా ఎంపికయ్యారు.

ఇచ్ఛాపురం రూరల్: ఈ ఏడాది మండలంలోని ఇద్దరు ఎస్జీటీ ఉపాధ్యాయులకు జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు లభించాయి. ఈదుపురం (ఆర్) ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు కె.చంద్రశేఖరం, డొంకూరు మోడల్ ప్రైమరీ పాఠశాల హెచ్ఎం కె.సాయిరాంలు అవార్డుకు ఎంపికయ్యారు. వీరిని ఎంఈవోలు కురమాన అప్పారావు, ఎస్.విశ్వనాథం, ఉపాధ్యాయ సంఘాలు అభినందించారు.

జంగిల్ క్లియరెన్స్

వజ్రపుకొత్తూరు: మండలంలోని కొండవూరు నుంచి చిన్నమురహరిపురం వరకు ఉన్న రహదారిపై గురువారం కొండవూరు యువకులు, పాఠశాల విద్యార్థులు శ్రమదానంతో జంగిల్ క్లియరెన్స్ చేపట్టారు. ఈ రహదారిపై మలుపులు వద్ద తరచూ ఎదురెదురుగా వస్తున్న వాహనాలు ఢీకొని ప్రమాదాలు జరుగుతున్నాయి. పాఠశాల బస్సులు, లగేజీ వ్యాన్‌లు నిత్యం తిరుగుతుంటాయి. మరిన్ని ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ యూత్ అధ్యక్షుడు దట్టి నాగేష్ ఆధ్వర్యంలో పొదలు, చెట్లను శ్రమదానంతో తొలగించారు. కార్యక్రమంలో పి.వెంకట్, జి.నాగరాజు, ఎస్.కిరణ్, పి.నవీన్, డి.హేమ తదితరులు పాల్గొన్నారు.

ఎరువులు అందించడంలో ప్రభుత్వం విఫలం

వజ్రపుకొత్తూరు: ఖరీఫ్‌లో రైతులకు సకాలంలో ఎరువుల అందించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని వైఎస్సార్‌సీపీ మండల మహిళా విభాగం అధ్యక్షురాలు జల్లు ఉషారాణి అన్నారు. గురువారం ఆమె పూండిలో విలేకరులతో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆర్బీకేల వద్ద పెద్ద ఎత్తున ఎరువుల నిల్వలు ఉంచి రైతులకు అందించామని, నేడు కూటమి ప్రభుత్వంలో రైతులు యూరియా కోసం అగచాట్లు పడుతున్నారని విమర్శించారు. దీంతో ఈనెల 9వ తేదీన పలాసలో రైతుల పక్షాన పోరాడేందుకు పెద్ద ఎత్తున కార్యక్రమం చేపడుతున్నామన్నారు. కార్యక్రమాన్ని అందరూ విజయవంతం చేయాలని కోరారు.

లడ్డూ అ'ధర'హో

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని తిప్పనపుట్టుగ గ్రామంలో నిర్వహిస్తున్న 57వ వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా లడ్డూను వేలంపాటలో అదే గ్రామానికి చెందిన శివాజీ మజ్జి రూ.1.41 లక్షలకు దక్కించుకున్నాడు.

టెక్కలి రూరల్: మండలంలోని రావివలస గ్రామంలో గణేష్ నవరాత్రుల్లో భాగంగా స్వామివారి వద్ద ఉంచిన లడ్డూను అదే గ్రామానికి చెందిన బడే వరాహ శంకరావు దంపతులు రూ.1 లక్షకు సొంతం చేసుకున్నారు.

ఉపాధ్యాయులు మార్గ నిర్దేశకులు

ఉపాధ్యాయులు మార్గ నిర్దేశకులని వక్తలు అన్నారు. ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి నియోజకవర్గాల్లోని అన్ని పాఠశాలలు, కళాశాలల్లో ముందస్తు ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు నిరంతరం విద్యార్థులుగా ఉండాలని సూచించారు. పాఠశాలల్లో అంకితభావంతో పనిచేసిన ఉపాధ్యాయులను సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈవోలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్


పలాస: శ్రీకృష్ణ సాహితీ పాఠశాలలో ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న దృశ్యం


వజ్రపుకొత్తూరు: కంబాలరాయుడుపేటలో...


ఇచ్ఛాపురం రూరల్: ధర్మపురం పాఠశాలలో...


పలాస: సర్వేపల్లి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు


వజ్రపుకొత్తూరు రూరల్: హుకుంపేట గ్రామంలో...


కవిటి: ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ప్రిన్సిపాల్ సింహాచలం నాయుడికి సన్మానం